# మన వూరూ....... మన బాల్యమూ!

జీవితం నిండా పరచుకునే కన్పించని వెన్నెల-బాల్యం. నాన్న స్పర్శలోంచి, అమ్మ ఒడిలోంచి, బంధువుల, మిత్రుల ఆప్యాయతల అభిమానపు కంచె మధ్య చల్లగా పెరిగే లేత మొక్క -బాల్యం.

బాల్యంలో మనం మనకు తెలీకుండానే ఎన్నెన్నో వర్ణాల ఇంద్రధనస్సుల మీద నడుస్తుంటాం. ఎడం చేతి పిడికిట్లో లేత సముద్రపు నురగల్ని అద్దుకుని, కుడిచేతి పిడికిట్లో నీరెండ మెరుపుల్ని రుద్దుకుని, పచ్చి ఇసక మీద పడిన పాద ముద్రల్ని చూస్తూ పరిగిత్తే మంచి కాలమే కదా- బాల్యం'' అంటాడు కథా రచయిత దాట్ల నారాయణమూర్తి రాజు.



అలాగే, తను పుట్టిన ఆకుల ములగాం గ్రామం గురించి చెబుతూ 'ఊరి నిండా పచ్చి తమలపాకులే. మట్టి రోడ్ల నిండా పచ్చదనం పొదిగినట్లు తమలపాకులు, ఆ ఆకుల మీద నడుస్తున్నప్పుడు పసిపాదాల తాకిడికి ఉచ్ఛ్వాస్వ, నిశ్వాసాలు విడుస్తున్న ఆ తమలపాకుల వింతవాసనలు' అంటాడు.

ఆ తర్వాత తను పెరిగిన విజయనగరం గురించి చెబుతూ 'అప్పట్లో విజయనగం బావుండేది... అయోధ్యా మైదానంలో గోళీకాయలాడుకోవడం, గాలిపటాలు ఎగురవేసుకోవటం... భోగినాటి తెల్లవారు జామున మంటల వెలుగుల్లో తలస్నానం చేసి, కొత్త బట్టలు కట్టుకుని చలికాచుకుంటూ కూర్చోవడం....' అంటూ నెమరు వేసుకుంటాడు.

"విశాఖపట్టణం ఎప్పుడు పుట్టిందో నాకు తెలియదు కానీ విశాఖపట్టణంలో 1910వ సంవత్సరంలో నేను జన్మించాను. అప్పటి నుండి నేనూ విశాఖపట్టణమూ కలిసే పెరుగుతూ వచ్చాము. విశాఖపట్టణానికి హార్బరు వచ్చినప్పుడు నాకు యౌవనం వచ్చింది. అందరూ ప్రేమగీతాలు రాసే ఆ రుతువుల్లో నేను పారిశ్రామిక విప్లవాన్ని కౌగిలించాను." అంటాడు మహాకవి శ్రీశ్రీ తన బాల్యాన్ని, తను పుట్టిన ఊరునూ తలుచుకుంటూ.

'నేను 1898 ఆగస్టు 11న బరంపురంలో మాతామహులు దిగుమర్తి వేంకట రామయ్యపంతులుగారి ఇంట్లో పుట్టాను... నేను చిన్నప్పటి నుంచీ బరంపురంలోనే తాతయ్యగారి దగ్గరే పెరగడం చేత నాకు ఆయన దగ్గర అతి చనువు... నాకు అక్షరాభ్యాసం ఎవరు చేశారో నాకు 'గ్యాపకం' లేదు. ఎర్రమన్ను తెప్పించి, ఇటుకల పొడితో కలిపి ఒక పావు అంగుళం ఎత్తున పరిపించి, చదును చేయించి, దానిపైన చూపుడు వేలుతో ఓనమాలు దిద్దడం నాకు బాగా గ్యాపకం ఉంది. చూపుడు వేలు కాయ కాసేది కూడానూ' అంటాడు అతడు. అతడు ఆమె నవలా రచయిత వుప్పల లక్ష్మణరావు తవ బతుకు పుస్తకంలో బాల్యం గురించీ తన ఊరు గురించీ 'గ్యాపకం' చేసుకుంటూ.

ఇలా ఎందరో తమ బాల్యం గురించీ, తాము పుట్టి పెరిగిన ఊరు గురించీ తమ మమకారం తెలుపుకున్నారు. ఆ స్మృతుల్ని మధుర స్మృతులుగా పదిలపరుచుకున్నారు.

తమ పుట్టిన ఊళ్లనే కాదు, తమ పూర్వీకులు జన్మించిన అసలు ఊరును చూడాలనుకున్న వాళ్లూ, చూసి వచ్చినవాళ్లూ ఉన్నారు.

అలెక్స్ హేలీ తన పూర్వీకులు పుట్టిన దక్షిణాఫ్రికాలోని ఊరు చూడడం కోసం వెళ్లడమేగాక, తన పుట్టుక మూలాల్ని శోధించి సాధించాడు. సుప్రసిద్ధ కథాశిల్పి రాచకొండ విశ్వనాథశాస్త్రి తన పూర్వీకుల ఊరు రాచకొండను వెళ్లి చూశాడు.

అలాగే ప్రముఖ కథా రచయిత కాళీ పట్నం రామారావు తన పూర్వీకుల జన్మస్థలం కాళీపట్నం వెళ్లి చూశాడు. అలాగే కలిదిండి వెళ్లి చూడాలని నేనూ అనుకుంటున్నాను.

ఇక పుట్టిన ఊరు కైకవోలునూ పెరిగిన పెనమళ్లనూ తలుచుకున్నప్పుడు ఎక్కువగా నా బాల్య స్మృతులే గుర్తుకొస్తాయి.

పుట్టి పెరిగిన ఊరు పైనా, నివసించిన ఇంటిపైనా, అక్కడి పరిసరాలపైనా దాదాపుగా అందరికీ అభిమానం ఉంటుంది. కాస్తోకూస్తో గర్వమూ ఉంటుంది. అభిమానము ఉంటుంది.

దేవులపల్లి కృష్ణశాస్త్రి మావూరు అనే కథ కూడా రాశాడు.

మాక్సింగోర్కీ తన బాల్యం గురించి రాస్తూ పొట్టకూటి కోసం ఓ బేకరీలో తను పనిచేయడం గురించి వర్ణించాడు. బాల కార్మికుడిగా పాఠశాలల్లో చదువుకోలేక పోయిన ఆ మహారచయిత "జీవితమే గొప్ప విశ్వవిద్యాలయం" అన్నాడు.

రాముడికి అయోధ్య మీద అభిమానం ఉన్నట్టే రావణాసురుడికీ లంక మీద అలవి మీరి ప్రేమ ఉంటుంది. ఇది మానవ నైజం.

అంచేతనే పాకిస్థాన్ సైనిక పాలకుడు పర్వేజ్ ముషార్రఫ్ భారత్ పర్యటనకు వచ్చినప్పుడు తను చిన్నప్పుడు నివసించిన ఢిల్లీలోని నాటి నహార్వాలీ హవేలీని చూడాలనుకుంటున్నాడు. అప్పట్లో సివిల్ సప్లయ్ డైరెక్టరేట్‌లో క్యాషియర్‌గా పనిచేసిన ముషార్రఫ్ తండ్రి సయిద్ ముషార్రఫువుద్దీన్ ఆ హవేలీలో నివసించాడు. ముషార్రఫ్ నాలుగేళ్ల వయసు వరకూ అక్కడే తప్పటడుగులేస్తూ బాల్యాన్ని గడిపాడు. అతన్ని అల్లారుముద్దుగా పెంచిన అనారో బేగం పేదరికాన్ని అనుభవిస్తూ ఢిల్లీ గేట్ వద్ద బతుకుబండి లాగుతోంది. వాడి చిన్నప్పటి రూపమే నా కళ్లల్లో కదులుతోంది. ఇంతకాలం నన్ను గుర్తు పెట్టుకోలేదు. 'రానీ భడవని, చెవి మెలేస్తా' అంటోంది అనారో బేగం.

తను తప్పటడుగులు వేసిన నహార్వాలీ హవేలిని ముషార్రఫ్ తప్పక చూస్తాడు. తన చిన్నప్పటి ఇంటి మీది ప్రేమను ఎలానూ తీర్చుకుంటాడు. తనను అభిమానంతో ముద్దాడి పెంచిన నేటి నిరుపేద అనారో బేగంను పలకరిస్తాడా? కృతజ్ఞతతో కౌగలించుకుంటాడా? ఇంకేమన్నా సాయం చేస్తాడా?

ముషార్రఫ్ మమకారం మాటలకే పరిమితమో, చేతల్లోనూ చూపిస్తాడో త్వరలోనే తేలిపోతుంది.

ఎదురు చూద్దాం కాస్త ఓపికతో!

1-6-2001, వార్త దిన పత్రిక